

# చేదే బువ్వట...!

—తల్లావఝ్ఝుల సుందరం

**కృష్ణమూర్తి** అర్ధాంగి చేసుకున్న పుణ్యమో, పిల్లల పుణ్యమో, దేశ దవుర్భాగ్యమో తెలీదు కానీ—కృష్ణమూర్తి గుండె ఆగిపోబోయి యధాతథం అయింది. ఎదురుగా ఉన్న ప్రపంచం తల్లక్రిందులుగా, అసహ్యంగా కనిపించింది. తన చేతుల్లోని పాత పుస్తకాలు తెలుగు సాహిత్యానికి మరణ శాసనాల్లా కనిపించాయి. మరోసారి చూశాడు. సందేహం లేదు. తన దృష్టికి దోషం లేదు. తను చదివిందికూడా ఖచ్చితంగా తెలుగే.

"! పూజ్యులు, మహోపాధ్యాయులు శ్రీ బదరీనాథ శాస్త్రిగారికి భక్తితో—దేవులపల్లి కృష్ణశాస్త్రి."

కృష్ణమూర్తి చేతిలో ఉన్న మట్టి రంగులో నలిగిన పాత పుస్తకాలు తెలుగు సాహితీ కన్యకు కొత్త పలుకులు నేర్పి వర్ణనలలో అలంకరించి తెలుగు సౌరభాన్ని వెన్నెలలో వెదజల్లిన మహా కవులు తమ స్వహస్తాలతో, స్వదస్తూరితో బదరీనాథ శాస్త్రిగారికి ప్రేమ పురస్సరంగా సమర్పించుకున్న తమ రచనల ప్రతులు. అందులో కృష్ణశాస్త్రి 'వూర్వశి' సౌందర్య విరువులు, విశ్వనాధ 'కిన్నెరసాని' వంపుల గలగలలు, నండూరి 'ఎంకి' వెర్రి చూపులు కలగా పులగంగా.

ఒక సాహితీ యుగాన్ని తన చేతిలో బంధించినట్లు అనుభూతి. ఎందరో మహా కవులు తన్ని చుట్టుముట్టేసినట్లు వెల్లువలా ఆనందం ఉక్కిరి బిక్కిరి చేసి గుండెను రెప రెప లాడించి కళ్ళల్లో అల్లల్లాడే కన్నీరూరింది కృష్ణమూర్తికి.

"మొత్తం పది రూపాయలు. సార్." పాత పుస్తకా లమ్మే ముసలాడు కృష్ణమూర్తి చేతిలో పుస్తకాల్ని చూపుతో లెక్కించి రేటు చెప్పాడు.

"ఈ పుస్తకా లన్నీ కలిపి పది రూపాయలా?" అప్రయత్నంగా, ఆశ్చర్యంగా అడిగాడు నమ్మశక్యంకాక.

"అంతకన్నా తక్కువకి రావు, సార్. ఇష్టముంటే తీసుకోండి!" చిరాగ్గా అన్నాడు ముసలాడు.

అంత గొప్ప పుస్తకాలు అంత చవకగా ఇస్తున్నందుకు బాధ పడ్డాడు కృష్ణమూర్తి. ఆ పుస్తకాల గొప్పతనం విలువ తెలీని ముసలాడ్ని ఎగాదిగా చూసి పది రూపాయలు ఇచ్చాడు.

ఆదివారం నాడు ఫుట్‌పాత్ మీద పుస్తకాలు కొనడం కృష్ణమూర్తికి అలవాటు. అందు కోసం ప్రతి ఆదివారం పది రూపాయలు బడ్జెట్టుకూడా కేటాయించాడు. సాహిత్యం మీద ఎంత అభిలాష ఉన్నా ఆర్థికంగా సామాన్యుడు కావటంతో సెకండ్ హాండ్ పుస్తకాలే శరణ్యం. అలా కొన్న పుస్తకాల్ని శ్రద్ధగా తనే బైండింగ్ చేసి పదిల పరుస్తాడు. కృష్ణమూర్తి సగం ఇల్లు పుస్తకాల్తోనే నిండి పోయింది.

కృష్ణమూర్తి స్కూలు ఫైనల్ పరీక్ష తప్పిన రోజుల్లో మరో కాలక్షేపం లేక వాళ్ళ వూళ్ళో వీర్రాజు కిళ్ళీ కొట్టులో డిటెక్టివ్ పుస్తకాలు అద్దెకు తెచ్చుకుని చదవటంతో ప్రారంభమైన పఠనాశక్తి భావకవితా యుగంలోకి పాకి, వచన కవితల్లో తేలి విప్లవ కవితా ప్రళయ ప్రభంజనాన్ని చవి చూసి మళ్ళీ ఛందోబద్ధ సాహిత్యంమీద మక్కువ పెరిగింది.

మంచి పుస్తకం మంచి స్నేహితుడని నమ్మిన వాడు కావటంతో అవకాశం దొరికిన ప్రతి క్షణం కావ్యపఠనంలో వెచ్చిస్తాడు కృష్ణమూర్తి.

బదరీనాథశాస్త్రిగారంటే కృష్ణమూర్తికి విపరీతమైన అభిమానం. అందు క్కారణం—శాస్త్రిగారి కలం నుంచీ జారిన భావాలు వెన్నెల చీర చుట్టుకుని, చుక్కల్ని పూలుగా పెట్టుకుని పద గాంభీర్యమే ప్రాణంగా తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయంగా మిగిలాయి. అసలు బదరీనాథ శాస్త్రిగారికి తెలుగు సాహిత్యంలో సముచిత స్థానం రాలేదని కృష్ణమూర్తి నమ్మకం. అది నిజంకూడానని చాలామంది ప్రముఖ కవులు ఆ రోజుల్లో ఒప్పుకున్నారు.

బదరీనాథశాస్త్రిగార్ని స్మరించే వాళ్ళు కానీ ఆయన రచనలని నేటి పాఠకులకు అందించే ప్రయత్నం కానీ ఎవరూ చేయక పోవటంతో కృష్ణమూర్తికి బాధ కలిగించింది. ప్రముఖ పుస్తక సంస్థలకి అకాడమీ వారికి పలుమార్లు శాస్త్రిగారి రచనల లోని విశిష్టతని తెలియ పరుస్తూ ఆయన పుస్తకాల్ని ప్రచురించాలని ఉత్తరాలు రాశాడు. సమాధానం మాత్రం లేదు ఎవరి దగ్గర నుంచీ. రాసిన కావ్యాలు అన్నీ దొరక్కపోవటంతో చాలా ప్రచురణ సంస్థలకి ఉత్తరాలు రాశాడు. ఫలితం శూన్యం.

కృష్ణమూర్తి ఆలోచన్లు తెగాయి.

బేరాలు ముగిసిం తరవాత మిగిలిన పుస్తకాల్ని కట్టలు కట్టి రిక్షా లోకి ఎక్కిస్తున్నాడు ముసలోడు.

"చూడండి. ఈ పుస్తకాలు మీరెక్కడ కొన్నారు? అడిగాడు ముసలాడ్ని కృష్ణమూర్తి.

"ఏ పుస్తకాలు? !" బీడీ వెలిగిస్తూ అడిగాడు ముసలాడు.

"ఇవి!" చేతిలో పుస్తకాలు చూపించాడు.

ఏ ఎదవో అమ్మేసుంటాడు. మాకు వివరాలతో పనేమిటి? " పుస్తకాల్ని రిక్షాలో చేర్చే ప్రయత్నంలో అన్నాడు ముసలాడు.

మరో ప్రశ్న వెయ్యలేదు కృష్ణమూర్తి. మెదడు చెదలు తిన్న కావ్యంలా ఉంది. స్పందన కలిగించని కవితలా అడుగులు అస్తవ్యస్తంగా పడుతున్నాయి. ఆలోచనలు గజిబిజిగా.

ఇల్లు చేరాడు. భోజనం చెయ్యబుద్ధి కాలేదు. ఎంత ప్రయత్నించినా కంటి మీద కునుకు రాలేదు.




ప్రతి క్షణం తను కొన్నపుస్తకాల్ని స్పృశిస్తూ తదేకంగా వాటిల్నే చూస్తూ ఆత్మానందం పొందాడు.

ఆ రాత్రి కృష్ణమూర్తి ఆలోచనల్లో ఎన్నో ప్రశ్నలు ఉదయించాయి.

శాస్త్రిగారి ఇంట్లో పిల్లలెవరో చిల్లర పైసల కోసం భద్రంగా దాచుకున్న ఆయన పుస్తకాల్ని అమ్మేస్తుంటారు అన్న అభిప్రాయాని కొచ్చాడు కృష్ణమూర్తి. అలాంటి వెధవల్ని చంపినా ఫరవా లేదనికూడా అనుకున్నాడు.

ఎంత శ్రమైనా సరే మళ్ళీ పుస్తకాలన్నీ ఆయనకు పంపెయ్యాలి! అన్న నిర్ణయం తీసు కున్నాడు.

మరి ఆయన అడ్రస్సు? అస లే వూర్లో ఉంటు న్నారు? కునుకు రాబోయే ముందు అనుమానం మెదిలింది. అది పెరిగి పెద్దదయింది.

కంటికి, కునుక్కీ మధ్య దూరం పెరిగింది.

నిర్ణయం గుర్తు రాగానే పట్టుదలకి పునాది బలపడింది.

• • • • •

హైదరాబాదు నగరంలో ఉన్న ప్రముఖ రచయితల్ని, విమర్శకుల్ని కలిశాడు. మరోసారి పాత కావ్యాలు ప్రచురించిన పుస్తక ప్రచురణ సంస్థలకి ఉత్తరాలు రాశాడు. పత్రికల్లో ప్రకటన కూడా ఇచ్చాడు. కొందరి దగ్గర నుంచీ ఎప్పటిదో చిరునామా లభ్యమయింది. ఉత్తరాలు రాశాడు. రిజిస్టర్డు ఉత్తరాలు తిరిగొచ్చాయి. దాంతో పట్టుదల మరింత పెరిగింది. అంతటి మహా రచయిత చిరు నామా కోసం పడ్డ తిప్పలు తలుచుకుంటే సాహితీలోకం ఆయన్ని ఎంతగా మరిచిపోయింది అర్థమై దుఃఖం వచ్చింది కృష్ణమూర్తికి.

రెండు నెలల నిర్విరామ కృషిలో కృష్ణమూర్తి మానసికంగా నీరస పడ్డాడు. ఒక రోజు అనుకోకుండా మద్రాసులో తెలుగు కావ్యాలను ప్రచురించి నేటి పాఠకుల ఆదరణ లేని కారణంగా మూసిన సంస్థ నుంచీ ఉత్తరం వచ్చింది. అది చాలా కాలం క్రితం కృష్ణమూర్తి శాస్త్రిగారి కావ్యాలను గురించి రాసిన ఉత్తరానికి జవాబు. అందులో శాస్త్రిగారి చిరునామా ఇస్తూ పుస్తకాలు లభ్యం కావని తెలియ పరుస్తూ రాశారు.

కృష్ణమూర్తి ఆనందానికి అనకట్ట లేదు. ఇంతకాలానికి తన అభిమాన కవిని కలిసే అదృష్టం కలగబోతున్నందుకు ఆనంద మేసింది. తన కోరిక సహధర్మచారిణికికూడా తెలియ పరిచాడు. ఆ క్షణం నుంచీ కృష్ణమూర్తి నేల మీద నడిచిన గుర్తు లేదు. నెలాఖరు రోజులు కావడంతో అతి కష్టం మీద అప్పు సంపాదించాడు.

కానీ కృష్ణమూర్తి ఆనందం ఆట్టే సేపు నిలబడ లేదు. కోరిక మీదకూడా దెబ్బ పడింది.

ఆఖరు దానికి అమ్మవారు. రెండో వాడు కింద పడి చెయ్యి విరక్కొట్టు కున్నాడు. అంతే. అప్పు అరక్షణంలో కృష్ణమూర్తి చేతిలో కరిగిపోయింది.

అవ్యక్తమైన బాధకి కృష్ణమూర్తి క్రుంగి పోయాడు.

పుస్తకాల్ని పోస్టులో పంపటం తప్ప మరో గత్యంతరం లేక తన అభిమానాన్ని పెద్ద ఉత్తరంలో నింపి పోస్టు చేశాడు. తొలిసారి అత్తారింటికి కూతుర్ని పంపుతున్నంతగా మహా ఇదైపోయాడు కృష్ణమూర్తి.

• • • •

ప్రతి రోజూ పోస్టుమన్ కోసం ఎదురు చూడ్డం, అతగాడి పెదవి విరుపుతో నీరసం ఆవహించడం అనవాయితీగా మారింది. ఒక వేళ అడ్రస్సు కాని మారిందేమో! అన్న అనుమానం మెదిలి నప్పుడు తను చేసిన పొరపాటుకి చింతించాడు. ప్రతి నిత్యం పేపర్లో తపాలాశాఖ ప్రతిభకి మచ్చు తునకలు ప్రచురిస్తున్నప్పుడు గుండాగినంతపనయ్యేది. రిజిస్టర్డ్ పోస్టులో పంపాలన్న ఆలోచన తనకి రానందుకు తన్ని తాను నిందించుకున్నాడు. అలా పంపిన వాటికి కూడా దిక్కు లేదని తెలిసినప్పుడు మరీ దిగులేసింది.

మర్లో నెల గడిచింది.

శాస్త్రిగారికి పంపించిన పుస్తకాల గురించి పూర్తిగా ఆశ వదులుకోక తప్పలేదు. ఆయనకంటూ పుస్తకాలు చేరితే సమాధానం వస్తుందన్న ఆశ మాత్రం చంపుకోలేదు. నిత్యం పోస్టుమేన్ని ఉత్త రాల గురించి అడగటం మానేశాడు.

ఒక రోజు చిరాగ్గా ఆఫీసు కాగితాల మధ్య ఇరుక్కునుండగా సీటు దగ్గిరకి పోస్ట్‌మేన్ వచ్చాడు. చేతిలో కట్ట విప్పి ముందో కార్డు పడేశాడు. ఆత్రుతగ అందుకున్నాడు కృష్ణమూర్తి. తనకు తెలిసిన ఒక పెద్ద మనిషి 'పెద్దకర్మ' తేదీని వివరిస్తూ ఉన్న సమాచారం. కోపంగా విసిరేశాడు కార్డును. దాంతోపాటు ఇచ్చిన కవర్ని తిప్పి చూశాడు. అది కొన్ని సంవత్సరాలు ప్రయాణం చేసినట్లు దుమ్ములో ధూళిలో నలిగి మరకలు పడి అసహ్యంగా ఉంది. దానిమీద కృష్ణమూర్తి చిరునామా గొలుసు కట్టు వడ్డీ లెక్క రాసినట్లుగా ఉంది.

"ఇరవై పైసలివ్వండి!" అన్నాడు పోస్టుమాన్ చేతిలో ఉత్తరాలు సర్దుకుంటూ.

"ఎందుకు?" అని అడక్కుండా చిల్లర తీసిచ్చాడు.

"స్టాంపులు తక్కువ అతికించారు" అని చిల్లర అందుకుని వెళ్ళిపోయాడు.

ఆ కవరు ఎవరి దగ్గర నుంచీ వచ్చిందీ ఎంత ప్రయత్నించినా అంతు బట్టలేదు కృష్ణమూర్తికి.

బదరీనాథశాస్త్రిగారి దగ్గర నుంచీ ఏమో! ? అన్న సందేహం వచ్చింది. కవరు పరిస్థితిని బట్టి కాదనిపించింది. దాని మీద ముద్ర చూశాడు. అలికేసి నట్లుంది. కవరు చింపకుండా ఎవరు రాశారో తెలుసుకోవాలన్న పట్టుదల పెరిగింది. పూహించ టంలో ఒక సిగరెట్టు తగలడింది. అయినా సాధ్య కాకపోవటంతో కవరు చించాడు. ఆత్రంగా ఉత్తరం బయటకు తీశాడు.

"ఇతి శివమ్—బదరీనాథశాస్త్రి" అని చివరి అక్షరాలు కళ్ళబడంగానే గట్టిగా అరిచి గెంతెయ్యాలని పించింది. తెలీని ఆనందం పెల్లుబికింది. పది నిమిషాలు తను చేసిన జాప్యానికి తనమీద తనకే కోపం వచ్చింది. అటెండర్ని పిలిచి కాఫీ తెమ్మన్నాడు. కృష్ణమూర్తి మొహం మీద ఎన్ని వేల కాండిల్సు బల్బు పెట్టినా ఇట్టే వెలిగేలా ఉంది. పక్క దేశాన్ని జయించిన




వాడిలా అందరి కేసి గర్వంగా చూశాడు. వాళ్ళెవరూ కృష్ణమూర్తిని చూళ్ళేదు.

కుర్చీలో హాయిగా కూర్చున్నాకే ఉత్తరం చదవటం ప్రారంభించాడు.

"ఆశీ: వి. కృష్ణమూర్తికి" అంతే.

కృష్ణమూర్తి మనసుకి రెక్కలు మొలిచి శరీరం నుంచీ వేరై అతగాడికి తెలీని లోకాల్లోకి ఎగిరి పోయింది.

మళ్ళీ చదవటం ప్రారంభించాడు.

"ఎంతో అభిమానంతో మీరు వ్రాసిన జాబు చేరినది. మిక్కిలి ప్రయాస పడి శ్రమ కోర్చి పంపిన పుస్తకములుకూడా చేరినవి. చాలా కాలముగా సాహిత్యముతో ఉత్తర ప్రత్యుత్తరములతో సంబంధ బాంధవ్యములు తెగి పోయిన ఇంత కాలమునకు మీ జాబు నా ఉనికిని గుర్తు చేసినది.

నన్ను గురించిన వివరములు తెలుసుకోవాలన్న మీ అభిలాషకు మిగులమిక్కిలి సంతసించి నన్నూ ఏమి చెప్పుకోలేని స్థితిలో యున్నాను.

జీవన స్థితి గతులు తెలుసుకోలేని పసితనం నుంచీ ప్రాపంచిక విషయాల పరిధుల దాటి భావనా జగతి జిలుగు వెలుగుల్లో వేద నారురితో ఆవేశంగా పయనించి వెనుతిరిగి చూస్తే—నే నొక్కడినే ఒంటరిగా!

నేను నమ్మిన దారే మరిచానో! నేను నడిచిన దారే మర్చిందో? నన్న సందేహం నివృత్తి కాకముందే— అప్పటికే వచన కవితా ఝంఝామారుతం ప్రబలంగా వీస్తూంది. నే వింకా చాదస్తుడ్నని ఛందోబద్ధ సంకెళ్ళతో బందీనని నిందకూడా వేసిన సంగతి తెలిసే ఉంటుంది.

నే నెప్పుడూ నవ్యతకు ప్రాధాన్యం ఇచ్చాను. నవ కవితా ధోరణులను ఆహ్వానించాను. అప్పటి యువ కవులందరికీ ప్రోత్సాహం కల్పించాను. ఏ సాహిత్యం అయితే నీళ్ళ కలాలకు పునాది వేసిందో దాన్నే అవహేళన చేసే నేటి మహా కవుల మీద జాలి చూపించగలను.

ప్రతీ కవీ తను భౌతికంగా మరణించినా తన కావ్యాల ద్వారా చిరంజీవి గానే మనగలుగుతాడు. నాకు ఆ అవకాశము కూడా లేదు. ఎనుబది సంవత్సరముల వయస్సు మించినను నా మీద దైవానికి కరుణ కలగలేదు.

నేను వ్రాసినవి మచ్చుకికూడా నా వద్ద లేవు. జాగ్రత్త పరచాలన్న ధ్యాసకూడా లేదు. అందుకే నన్ను తెలిసి, నీకు తెలీని ఈ కుగ్రామంలో ఇతరుల యొక్క సానుభూతి, సహకారములతో రోజులు వెళ్ళమారుస్తున్నాను. ఈ విధంగా జీవనం సాగించాలన్న కోర్కె కించిత్ లేకపోయినను మిగిలిపోయిన ఇహలోకబంధము కొరకు తప్పని సరైనది.

చిన్నవాడి వైనను నీకు ధన్యవాదములు తెల్పుట మర్యాద. ఈ పుస్తకములు శ్రమ కోర్చి పంపినావు. నువ్వు వ్రాసినట్లు ఇవి ఎవ్వరూ నా దగ్గర తస్కరించ లేదు. ఇంత తుచ్ఛమైన, నీచ్యామైన స్థితికి దిగజారింది నేనే! అందుకు కారణము కలదు. శ్రేపాయము నుండి అంధత్వంవల్ల, చీకటినే తప్ప వెలుతురు చూడని నా మనుమరాలు నిరుగు దుస్తుల్లో వయస్సును దాచలేకున్నా—కళ్ళున్న లోకం చూపులతో ఆ చిన్నారి వయస్సును కొలుస్తుంటే చూసి అసహాయునైతిని. మరో మార్గం తోచక నన్ను నేను మరొకమారు చంపుకుని కాలం తీరి వెళ్ళిన వాళ్ళ అదృష్టానికి మనసులో ఈర్ష్య పడి గౌరవంతో నాకిచ్చిన పుస్తకాలకు కృతజ్ఞతలు తెలుపుకుని ఏ విజ్ఞానవంతుడూ చెయ్యని పని చేశాను. కేవలం కొద్ది రూపాయలకు తూకముతో అమ్మితిని. అవి అంత దూరం వస్తాయని వూహించ లేదు. ఆ వచ్చిన ధనంతో నా మనవరాలికి ఆచ్ఛాదన కలిగించాను.

ఇటువంటి దుర్ఘటన మరొకరికి కలిగించ వద్దని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను. నీ లాంటి సచ్ఛీలురకు, సహృదయులకు నే నింకా గుర్తున్నందుకు గర్వించు చున్నాను.

ఇతి శివమ్ బదరీనాథశాస్త్రి."

చదవటం పూర్తయ్యేసరికి కృష్ణమూర్తి కన్నీటి సరస్సు ఎర్రగా మెరిసింది. కృష్ణమూర్తి కేం తెలీటం లేదు. ఏవీ గుర్తు రావటం లేదు. చెరిగి పోతున్న కలలా బూజరగా.

తీగలు తెగిన వీణలో కన్నీటి పువ్వు మీద జాట్లు విరగ బోసుకున్న పుస్తక ధారిణి. కన్నీటి సముద్రంలో ఉక్కిరి బిక్కిరవుతున్న వైధవ్యం పొందిన కవిత.

ఏవో వింత ధ్వనులు. వినిపించని ఘోష. నరాలు చిట్లి పోతున్నాయి. కృష్ణమూర్తి గుండె కన్నీటి బొట్టులా కదిలి చిట్లింది.

"కవితల్ పాడిన వ్రాయ నేర్చిన
వృథా కష్టంబె పో కాల్చనా.
నవరంగా సొగసిచ్చి మేల్ యువతి
వేషం బిచ్చి బుట్టించితే ఎవరుం మెచ్చి
ధనంబు లిచ్చెదరు గాదే పాపుం దైవమా!"

శాస్త్రిగారి వూహా రూపం కన్నీటిలో కరుగు తుండగా శ్రీనాథుడు పెదాల మీద దొర్లాడు. మరోసారి గుండె ఆగిపోనందుకు బాధ పడ్డాడు కృష్ణమూర్తి.